తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతపల్లి :-ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు వసతి గృహాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రిన్సిపాల్ ఎం విజయభారతి దృష్టికి విద్యార్థిని, విద్యార్థులు విన్నవించడంతో స్పందించిన ఆమె గ్రంథాలయ అధికారి తాంగుల జగత్ రాయ్ తో కలిసి గత స్పందనలో అప్పటి కలెక్టర్‌ను వినతిపత్రాన్ని అందజేశారు. ఫలితంగానే స్థానిక ఎంపీపీ నిధులు వెచ్చించి వసతి గృహాలలో తాగునీటి బోర్లు ఏర్పాటుకు శుక్రవారం ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దుర్యాపుష్పలత లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తాగునీటి సౌకర్యం కల్పనకు కృషి చేసిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ నిర్వాహకులు పసుపులేటి వినాయకరావు, గసాడి తిరుపతి, అధ్యాపకులు రవీంద్ర నాయక్, జి జగదీష్ బాబు, ఎం.నాగేంద్రబాబు, ఎస్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:కింది స్థాయిలో పరిష్కరించ వలసిన సమస్యలు కింది స్థాయిలోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమానికి 76 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలో అందే ఫిర్యాదులపై కలెక్టర్ ఎండార్స్మెంట్ ఉండాలని అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలా అడిగితే సహించేది లేదని హెచ్చరించారు. మీకోసం కోసం వచ్చిన ఫిర్యాడులలో 95శాతం తగు సమయం లోపలే పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఫిర్యాదులు పునారావృతం అవుతున్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా సరైన పరిష్కారం లభించకపోవడం లేదా పరిష్కరించకుండా ఉంచడంతో పునరావృతం అవుతున్నాయని గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.జే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ పద్మలత, జిల్లా అధికారులు, డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-పాడేరు: బాల్య వివాహాల నిర్మూలనను మనందరం భాద్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం జిల్లా స్థాయి బాల్యవివాహాల కమిటీ హైబ్రిడ్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా పివిటిజి తెగలు, బడి మానేసిన పిల్లలలో బాల్య వివాహాలు జరుగుతున్నందున వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత రెండేళ్లలో 25 బాల్య వివాహాలు నిరోధించినప్పటికీ గత రెండేళ్లలో 357 మంది టీనేజ్ గర్భవతులు, మరో 174 మంది బాలినలు ఉండడం పట్ల అసహనం వ్యక్త పరిచిన కలెక్టర్ గ్రామ స్థాయి సమావేశాలలో వారు బాల్య వివాహాలు చేసుకోవటానికి గల కారణాలు, వాటి వల్ల వారు పండుతున్న కష్ట నష్టాలు అధ్యయనం చేసి భవిష్యత్తులో జరగకుండా చూడాలని ఆదేశించారు. సుప్రీం కోర్టుతో సహా రాష్ట్ర ప్రభుత్వం కూడా బాల్య వివాహాలను తీవ్రంగా పరిగణిస్తున్నందున దీనిని ఐసిడిఎస్‌తో సహా జిల్లా అధికారులు సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో బాల్య వివాహాల పట్ల కటినంగా వ్యవహరించే పరిస్థితులు ప్రభుత్వం తీసుకు వచ్చిందని, దాని ప్రకారం బాల్య వివాహాలు జరిగే గ్రామంలో ఆ గ్రామ కమిటీని భాధ్యులను చేస్తూ కమిటీ సభ్యులకు షో కాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామ స్థాయి కమిటీ సమావేశాలలో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను, కుటుంబాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు తెలియజేయాలని, గ్రామంలో జరిగే ప్రతి వివాహం నమోదు కావాలని ఆదేశించారు. బడి మానేసిన పిల్లలపైనా, 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థినిల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, బాల్య వివాహాల నియంత్రణపై ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2,276 మంది డ్రాపవుట్లు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడం లేదా నైపున్యాభివృద్ధి సంస్థ ద్వారా అవసరమైన శిక్షణలు అందజేయడం చేయాలన్నారు. ఎక్కువ డ్రాపవుట్లు ఉన్న జికె వీధి మండలంలో శిక్షణ కార్యక్రమాన్ని పైలట్ గా తీసుకుని జనవరి మూడవ తేదీ నుండి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం నుండి ప్రతి నేలా 15వ తేదీన బాల్య వివాహాల పై నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మలత, డిఇఓ బ్రహ్మాజిరావు, డిఎంహెచ్ఓ జమాల్ బాష, డిఎస్డిఓ రోహిణి, పోలీస్ ఇన్స్పెక్టర్ దీనబంధు, ఐసిడిఎస్ ఎపిడిలు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

పీసా కమిటీ ఎన్నికలపై అవగాహన

అనంతగిరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -అనంతగిరి:రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జనవరి నెల మూడో తేదీ జరిగే పీసీ కమిటీ ఎన్నికలపై అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అవగాహన కల్పించామని ఎంపీడీవో ఏవివి. కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి నెల మూడో తేదీ నుండి ఏడో తేదీ వరకు ఈ పీసా కమిటీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికలకు ఓటరు నమోదయి ఉండి గ్రామానికి చెందిన అర్హులైన వ్యక్తి అయి ఉండాలన్నారు. ఎన్నికలు సర్పంచ్ అధ్యక్షతన జరుగుతాయని, ఒకటి 1/3 వంతు మెజారిటీ ఆమోదం తెలుపవలసి ఉంటుందని తెలిపారు.

చింతపల్లి :పీసా చట్టం గ్రామసభలకు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ ఎన్నికలను జనవరి 3, 4 తేదీలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. పిసా ఎన్నికల నిర్వహణకు ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ జాహ్నవి, మండల విద్యాశాఖ అధికారి, 15 మంది ప్రొసీడింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 నుంచి జనవరి 2 వరకు గ్రామాలలో పిసా ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 15 మంది గెజిటెడ్ అధికారులను పి.ఓలుగా నియమించి వారికి శిక్షణ ఇచ్చామన్నారు.

సీలేరు:జనవరి 3 నుంచి 7 వరకు జరగబోవు పీసా కమిటీల ఎన్నికలపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పీసా ఎన్నికలు చేతులెత్తి ఎక్కువమంది ఎవరిని బలపరుస్తారో వారు ఎన్నికైనట్లు స్పెషల్ ఆఫీసర్లు ధ్రువీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని 16 పంచాయతీల్లో సర్పంచులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పీసా ఎన్నికల్లో కార్యదర్శి, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని తెలిపారు.

పారదర్శకంగా అంగన్వాడీ పోస్టుల ఎంపిక

రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో ఆరు మండలాల్లో కొత్తగా మంజూరైన 39 అంగన్వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం, మారేడుమిల్లి మండలాల్లో 39 ఆయా పోస్టుల భర్తీపై ఐసిడిఎస్ సిడిపిఓతో, ఐసిడిఎస్ సూపర్వైజర్లతో శుక్రవారం తన చాంబర్లో సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పోస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

మండలాల వారీగా భర్తీ చేయనున్న ఆయా పోస్టుల వివరాలు

అడ్డతీగల మండలం : వెంకటనగరం, చిక్కపుగడ్డ, మాకవరం, రేగడవీధి, పినికిలపాడు, తీయ్యమామిడి, రోళ్లగడ్డ, **రంపచోడవరం మండలం** : చెరువుపాలెం, పెదపాడు, **గంగవరం మండలం** : శరభవరం, చిన్న అడ్డపల్లి, **మారేడుమిల్లి మండలం** : మల్లవరం, నీలవరం, బందపాటి వీధి, మూసూరు, ఇ.కొత్తవీధి, కొత్తవలస, ముంతమామిడి, **రాజవొమ్మంగి మండలం** : బొడ్లగండి, లోతవారి వీధి, **వై.రామవరం మండలం** : పసరుగిన్నె, పుట్టగండి, భీమునిగడ్డ, సింహాద్రి పాలెం, రచ్చవలస, పాముగొంది, సింగవరం, మునగలపూడి, కోకితగొంది, బొడ్డపల్లి, కొత్తూరు, చింతకొయ్య, నాగలోవ, కొమరవరం, చలమటిపాకలు, గొరబంద, కొత్త పాటలు, పైడిపుట్ట, జాజి వలస తదితర గ్రామాల్లో ఆయా పోస్టులు భర్తీ చేయనున్నారు.

ఆయా పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి, సంబంధిత గ్రామాల్లో నివాసులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 నుండి 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసిడిఎస్ సిడిపిఓల కార్యాలయాలలో నేరుగా దరఖాస్తు సమర్పించాలని సూచించారు. అర్హత పొందిన అభ్యర్థులకు మౌలిక పరీక్ష తేదీ తరువాత ప్రకటిస్తామని చెప్పారు. ఈ 39 ఆయా పోస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత గల అభ్యర్థులను ఎంపిక కమిటీ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిడిపిఓలు సంధ్యారాణి, లక్ష్మీ ప్రసన్న, దేవమణి, సూపర్వైజర్లు సుధా, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

ప్రజాశక్తి-రంపచోడవరం

భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ మండల మాజీ అధ్యక్షులు అడబాల బాపిరాజు అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి కూటమి పార్టీల నాయకులు శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపిరాజు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలకు నాంది పలికి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి మోహన్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సలాది బాపిరాజు, మాజీ సర్పంచ్ వై నిరంజనీదేవి, టౌన్ ప్రెసిడెంట్ డి.జనార్ధన్, జనసేన మండల అధ్యక్షులు పాపోలు శ్రీనివాస్‌రావు, బిజెపి నాయకులు మంగారౌతు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యాన

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. భారత దేశానికీ రెండు సార్లు ప్రధాన మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ ఎన్నో ప్రజలకు ఉపయోగపడే చట్టాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంపచోడవరం నియోజకవర్గం నాయకులు నక్కబాల శివరామకృష్ణ, చిలకళ సత్యనారాయణ, చుక్క సంతోషకుమార్, బచ్చేలా ఆదినారాయణ, నల్లమిల్లి సుందర్‌బాబు, రాయిడు బాబు, నూనె అన్నారం తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

టేకులబోరులో పీసా కమిటీ ఎన్నిక జరపాలి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని టేకులబోరు గ్రామంలో పీసా కమిటీ ఎన్నిక జరిపాలని సిపిఎం శాఖ కార్యదర్శి కొండా ఈశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసా కమిటీ ఎన్నికలు జనాభా సరిపడా లేరనే సాకుతో నిలిపివేయడం మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఏజెన్సీ ఏరియాలో పంచాయతీ సర్పంచ్ గిరిజనుడు ఉండగా 300 పైచిలుకు ఓటర్లు ఉన్న గ్రామంలో పీసా కమిటీ వేయడం అధికారుల బాధ్యతగా స్వీకరించాలని, గిరిజన హక్కులకు భంగం వాటిల్లకుండా ఎన్నిక జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తెల్లగానే నాగరాజు, గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

చలి తీవ్రతకు గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి :చలి తీవ్రతకు గిరిజనుడు మృతి చెందిన ఘటన మండలంలోని అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అన్నవరం ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... లోతుగడ్డ పంచాయతీ చోద్రాయి గ్రామానికి చెందిన మువ్వల రమేష్ (400 అన్నవరంలోని సంత బయలు వద్ద గురువారం రాత్రి మద్యం సేవించి ఆ మత్తులో అక్కడే పడ కోవవడంతో చలి తీవ్రతకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. మృతదేహాన్ని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి శవ పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లుగా తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- అరకులోయ :మండలంలోని కొత్త బల్లుగూడ పంచాయతీ గద్యగూడా గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పది దరఖాస్తులు వచ్చినట్లు అరకులోయ తహాశీల్దార్ ఎం. వి.వి ప్రసాద్ తెలిపారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలు వేరు చేసేందుకు తదితర సమస్యలపై సిమిలిగూడ, సరునాయిగూడ గ్రామాల్లోని గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ సదస్సులో అరకు డిప్యూటీ తహసిల్దార్ గోవిందు, వీఆర్వో ఝాన్సీలక్ష్మి, సాయిబాబా, సర్వేయర్లు కాంతారావు, మనీషా శిరీష తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ మండలం గద్యగూడలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

హుకుంపేట మండలం గన్నేరుపుట్టులో మాట్లాడుతున్న వైఎస్ ఎంపిపి

హుకుంపేట :మండలంలోని గన్నేరు పుట్టు పంచాయితీలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, పోడు పట్టాలు త్వరితగతిన మంజూరు చేయాలనీ రెవెన్యూశాఖ అధికారులను కోరారు. డిప్యూటీ తహాశీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ సదస్సు లో వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిస్కారం చేస్తామన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం భూ ఆక్రమణలకు పాల్పడితే 6 సంవత్సరాల నుండి 10 ఏళ్ళు కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతమ్మ, గన్నేరుపుట్టు, చీకుమద్దుల సర్పంచ్‌లు సోకేలి కృష్ణా రావు, సూకూరు బొంజన్న దొర, వీఆర్ఓ రమేష్ బాబు,సెక్రటరీ అప్పన్న, సర్వేయర్‌లు సంజీవ్ రాజు, సింహచలం, వైస్ సర్పంచ్ మజ్జి మత్స్య రాజు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఓలు

భోజనం వడ్డిస్తున్న ఎంఇఓ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అడపవలస జిపిఎస్ పాఠశాల, కిల్లోగూడ ఎంపిపి పాఠశాలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం పెడుతున్న భోజన మెనూ అమలు తీరును పరిశీలించారు. అడపవలస పాఠశాలలో స్వయంగా ఆయనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండించి, ఆయన కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు మధ్యాహ్నం పూట పెడుతున్న భోజనం సక్రమంగా నిర్వాహకులు వండి పెట్టాలన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆయన సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఎం రాంప్రసాద్, పాల్గొన్నారు.

హుకుంపేట:-మండలంలోని తీగలవలస పంచాయతీ సరళం గ్రామంలో ఎంపీపీ పాఠశాలకు భవనం లేదని గ్రామ ప్రజలు శుక్రవారం స్పందనలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈఓలు సోమేలి చెల్లయ్య, కోడా ఈశ్వరరావు పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనం లేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు విన్నవించారు. రేకుల షెడ్డు నిర్మించడంతో తాత్కాలికంగా పాఠాలు బోధిస్తున్నారని గ్రామస్తులు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ, నూతనంగా పాఠశాల నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయితేనే పాఠశాల భవనాలకు మరమ్మతులు చేపడతామన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నేతలు రామారావు, సురేంద్ర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

జిల్లాలోని కొయ్యూరు గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మనోజ్ కుమార్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరినందుకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేయడాన్ని ఆ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, జీవన్ మృతుడి తండ్రి వంతల సత్యనారాయణను పోలీసులు ఈడ్చుకొని వెళ్లి జీపులో పడేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి మృతుడు మనోజ్‌కుమార్ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబానికి ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ, గురుకుల వసతి గహాల్లో ఇటీవల విద్యార్థుల మరణాలు అధికమైన నేపథ్యంలో వాటిపై క్షేత్రస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

పాడేరు : జిల్లాలో ఇటీవల కొయ్యూరు గురుకులం పాఠశాలలో పదవ తరగతి చదువుతూ మృతి చెందిన మనోజ్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని పోరాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ ఐ నాయకులను అక్రమ అరెస్టు చేయడం అన్యాయమని, మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్, జీవన్ మృతుని తండ్రి వంతల సత్యనారాయణని అక్రమంగా అరెస్టు చేయడం చాలా బాధాకరమన్నారు. అరెస్ట్ చేసిన నాయకులు, మనోజ్ కుమార్ తండ్రిని వెంటనే విడుదల చేసి మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి 50 లక్షల నష్టపరిహారం చెల్లించి కుటుంబానికి ఇల్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొయ్యూరు గురుకులం పాఠశాల విద్యార్థి మరణానికి గల కారణాలు క్షేత్రస్థాయి విచారణ జరిపించి, ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టాలని డిమాండ్ చేశారు.

30న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

ప్రజాశక్తి-విఆర్.పురం

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 30న విఆర్.పురం మండల కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు పిలుపునిచ్చారు. స్థానిక రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సున్నం రాజులు మాట్లాడారు. పేద, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, గొప్ప మేధావి అయిన అంబేద్కర్‌ను ఎగతాళి చేస్తూ అమిత్ షా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెలువెత్తినా అమిత్ షాను ప్రధాని మోడీ వెనకేసుకు రావడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కమిటీ నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్, కమ్మసిచ్చు సత్యనారాయణ, సిరపు తాతబాబు, తుర్రం బాబూరావు, తొడం రాజు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

తాగునీటి పథకాలు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మారుమూల బూదరాళ్ల పంచాయితీ పరిధి సాకులపాలెం, బొడ్డుమామిడి గ్రామాల్లో నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన తాగునీటి పథకాలను శుక్రవారం స్థానిక సర్పంచి సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్, నవ నిర్మాణ సమితి సీనియర్ మేనేజర్ కె.రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ జెఎస్ వేణుగోపాల్, జూనియర్ ఇంజినీర్ కె బుజ్జిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బూదరాళ్ల పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి, ప్రభుత్వంతో పాటు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

రక్తదాన శిబిరానికి స్పందన

రక్తదానం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కేంద్రం పాడేరులో స్థానిక కాఫీ హౌస్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఎఎస్ దినేష్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే అనేకమంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం లేనందున కార్యక్రమాలు కొంత కుంటుపడినందున సభ్యుల వినతి మేరకు వెంటనే సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.నూతన కార్యవర్గం ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ ప్రాంతాలలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు డ్రైవ్ ఉంటుందన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో సభ్యత్వ నమోదు వేగవంతం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులు, సచివాలయం ఉద్యోగులు, రెవెన్యూ, ఎంపీడీవోలు సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సేవా దృక్పథం ఉన్నవారందరూ ఇందులో సభ్యత్వం పొందాలని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తరం చేస్తున్నామని రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, ఇందుకు ప్రజలందరి సహకారం అవసరమన్నారు. డి.ఎస్.పి ప్రమోద్ కుమార్ రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సేవలను అభినందించారు. పోలీస్ శాఖ తరపున పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట పోలీస్ ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాడేరు శాఖ వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి.గౌరీ శంకర్, కోశాధికారి పి.సూర్య రావు, సభ్యులు గంగాభవాని, సుబ్రహ్మణ్యం, సంజీవరావు, టి.ప్రసాద్ నాయుడు, రవి, శ్రీనివాస్, జెసిఐ డైరెక్టర్, సభ్యులు బోర్ర నాగరాజు, ఎం మణి, డాక్టర్ రాఘవేంద్ర, కోఆర్డినేటర్ వి.లోహిత్ సిబ్బంది పాల్గొన్నారు

పాఠశాలకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- పెదబయలు:స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థి శెట్టి ప్రదీప్ కుమార్ పాఠశాల అభివృద్ధి తన వంతుగా సాయంగా లక్ష రూపాయలు చెక్కును అందించినట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ నిర్మల శుక్రవారం విలేకరులకు తెలిపారు. క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరైన పూర్వ విద్యార్థి ప్రదీప్ కుమార్ అందించారన్నారు. ఈ కార్యక్రమం లో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ తెరెస్, ప్రిన్సిపల్ సిస్టర్ నిర్మల, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ స్టెల్లి, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

దోమల నివారణపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి -సీతమ్మధార : ఇళ్లు, పరిసరాల్లో మురుగునీరు, మంచినీటి నిల్వలు ఆస్కారం లేకుండా చేయడం ద్వారా దోమలు, వాటి లార్వాల వృద్ధిని అరికట్టవచ్చునని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టవచ్చని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం అల్లిపురం (బీసగరి), భానోజీనగర్, మురళీనగర్, శివనగర్ యుపిహెచ్‌సిలను సందర్శించి, డ్రై డే కార్యక్రమం పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని ప్రజలకు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. తర్వాత ఆహెచ్ఒ, ఇ-ఔషధ, ఎన్‌సిడి. 3.0 సర్వేలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. ఆర్‌బిఎస్‌కె స్కూల్ విజిట్స్, ఎడ్యుస్ట్రి స్క్రీనింగ్‌ను సమీక్షించి, ఆభా ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని ఆదేశించారు. యుపిహెచ్‌సి పరిధిలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశాల మేరకు డిపిఎంఒ డాక్టర్ బి.ఉమావతి, బి.నాగేశ్వరరావు స్వతంత్ర నగర్, వాంబే కోలనీ పట్టణ ఆరోగ్యకేంద్రాలను సందర్శించారు.

సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

సిఐటియు ఆధ్వర్యాన కొనసాగిన వాలంటీర్ల రిలే దీక్షలు

వాలంటీర్ల దీక్షలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వాలంటీర్లకు ఇచ్చిన హామీలు అమలు చేసి వాలంటీర్ వ్యవస్థను యధావిధిగా కొనసాగించాలని అదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్లు చేపట్టిన దీక్షకు మద్ధతు తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ,కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యి 6 నెలలు పూర్తి కావస్తున్నా వాలంటీర్ల పై ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడం చాలా దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో వాలంటీర్లకు 10 వేలు వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలో వచ్చి 6 నెలలు పూర్తి కావస్తున్నా వాలంటీర్ వ్యవస్థ కొనసాగింపు పై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా మోసం చేస్తుందని తెలిపారు.వాలంటీర్లు ఐక్యంగా ఉండి గతంలో ఆశా, అంగన్వాడిలు తమ డిమాండ్లు నెరవేర్చుకొనుటకు ఏ విదంగా పోరాటం చేశారో ఆ విదంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు కె రామారావు, వాలంటీర్ యూనియన్ నాయకులు ఆనంద్, శాంతి, కుమార్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా నాయకుడు సన్నిబాబు ఆధ్వర్యంలో మండలంలో గ్రామ వాలంటీర్ల చేపట్టిన దీక్ష రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. పలు షాపుల్లో వాలంటీర్లు భిక్షాటన చేపట్టారు. అధికారంలోకి వస్తే పది వేల రూపాయలు గౌరవ వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి ఆ కుటుంబాలను రోడ్డున పడేసిందని సన్నిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 7 నెలల బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

పెదబయలులో భిక్షాటన చేస్తున్న వాలంటీర్లు

హుకుంపేట: స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ వాలంటీర్లు దీక్షను కొనసాగించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తపుల క్రిష్ణారావు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలలో 2.50లక్షల మంది వాలంటీర్లు 5సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వీరికి గౌరవ వేతనం నెలకు రూ.10వేలకు పెంచుతామని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మానిఫోస్టోలో హామీ ఇచ్చిందన్నారు. వేతనాలు పెంచకపోగా, నెలనెలా ఉన్న వేతనాలను ప్రభుత్వం చెల్లించలేదన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల మండల అధ్యక్షులు బి.కొండబాబు, సభ్యులు రాజారావు, సుజాత, వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనంతగిరిలో వాలంటీర్ల దీక్షలు

అనంతగిరి మండల కేంద్రంలో వాలంటీర్లు చేపట్టిన దీక్ష రెండవ రోజుకు చేరుకుంది. ఎంపిపి శెట్టి. నీలవేణి దీక్షా శిబిరాన్ని సందర్శించి వాలంటీర్లకు మద్దతు తెలిపారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఈ ఎ ో ం ా ట ా ని ్ కొనసాగించాలని ఆమె సూచించారు. సిఐటియు మండల కార్యదర్శి మొస్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటాన్ని ఉదృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల మండల సంఘం నాయకులు స్వాబి. అప్పలరాజు, చిట్టం నాగేష్. దతరులు పాల్గొన్నారు.

చింతూరులో దీక్షలు చేస్తున్న వాలంటీర్లు

చింతూరు :వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య హెచ్చరించారు. చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాల వాలంటీర్లు చింతూరు ఐటిడిఎ వద్ద రెండో రోజు చేపట్టిన దీక్షలను కొమరం పెంటయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లకు గౌరవ వేతనంగా పదివేల రూపాయలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ వ్యవస్థే లేదని చెప్పడం దారుణమన్నారు. తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, డిమాండ్ చేశారు. రెండో రోజు దీక్షలకు గ్రామపంచాయతీ కార్మికులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ముట్టం రాజయ్య, చింతూరు ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ చిన్ని, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకురాలు రాములమ్మ, వాలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడియన్ జానీ, యూనియన్ నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు కలుములు మహేష్, సాదులు రామిరెడ్డి, కుమార్, బద్రు, నాగరాజు, పద్మావతి, శాంతి, దుర్గారావు, వనరాజ్, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

హుకుంపేటలో వాలంటీర్ల దీక్షలు

విద్యుత్ ఛార్జీల బాదుడుపై వైసిపి నిరసన

వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి-రంపచోడవరం :రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంపై వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పోరుబాట పేరుతో శుక్రవారం ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. పందిరి మామిడి జంక్షన్ నుండి స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనంత బాబు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు, నేడు భారీ స్థాయిలో విద్యుత్ ఛార్జీలు పెంచడం శోచనీయమన్నారు. ఆరు నెల కాలంలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాడి ఆరు నెలలైనా నేటికీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. ఈ వైసిపి జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేట: విద్యుత్ భారాలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ కూడా రాజుబాబు తెలిపారు. మండల కేంద్రలో ఎంపీపీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం కరెంట్ బిల్లుల పెంపు పై నిరసన చేపట్టారు. కరెంటు బిల్లుల పెంపు జేబులకు చిల్లు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. కరెంట్ బిల్లు కట్టుకోలేక సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం పున: ఆలోచన చేయకుంటే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేటలో ఆందోళన చేస్తున్నవైసిపి శ్రేణులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అడ్డతీగల : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వరోత్సవ మహాసభ వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.తేజ, జిల్లా ఆడిటర్ పి.మంగరాజు ఆధ్వర్యాన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తేజ మాట్లాడుతూ జనవరి 5, 6, 7, 8 తేదీలలో జరుగు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి-అడ్డతీగల : మండల కేంద్రంలోని సచివాలయం-1కు పది మీటర్ల దూరంలో ఉన్న తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ బోరు బావి పాడైపోయి ఆరు నెలలైంది. దీనిని బాగు చేయాలని నాటి నుండి పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా నేటికీ మరమ్మతులు చేయలేదు. రెండు నెలల క్రితం తాగునీటి బోరు రిపేర్ చేస్తామని పంచాయతీ సిబ్బంది, మెకానిక్ వచ్చి చేతి పంపు పైభాగాన్ని విప్పి కార్యాలయానికి తీసుకెళ్లిపోయారు. బోరుపై ఇసుక బస్తాలు వేసి వదిలేశారు. నాటి నుండి దానిని రిపేరు చేయలేదు. దీనిపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కార్యాలయంలో డబ్బులు లేవని, తమ సిబ్బందికే రెండు మూడు నెలలుగా జీతాలు లేవని చెబుతున్నారని, తమకు గుక్కెడు నీళ్లు అందివ్వడానికి ఎవరూ చొరవ తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఇటువంటి దౌర్భాగ్య పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల్లో ఉన్న చేతిపంపులు పరిస్థితి ఏమిటని పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా మరమ్మతులకు కావాల్సిన మెటీరియల్స్ లేవని, త్వరలోనే రిపేర్ చేస్తామని చెప్పారు. అయితే బోరు రిపేర్ చేయడానికి కావలసిన పైపులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పుష్కలంగా ఉన్నాయని కొందరు చెబుతున్నారు. కావున ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ఈ బోరు రిపేరుకు తగు చర్యలు తీసుకొని తమకు గుక్కెడు మంచి నీళ్లు అందించాలని కోరుతున్నారు.

క్రిస్మస్, సంక్రాంతి కానుకలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుకలు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జికె.వీధి మండల కార్యదర్శి, గాలికొండ ఎంపీటీసీ అంపరింగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతికి చంద్రన్న కానుకలు అందజేసేవారని, ఇప్పుడు క్రిస్మస్ పండుగ పూర్తయిన నేటికీ రాష్ట్ర ప్రభుత్వం కానుకలు పంపిణీ చేయకపోవడం విచారకరమన్నారు. సంక్రాంతికి పిండివంటలు వండుకునేందుకు సరుకులు అందించాలని కోరారు. జీకే వీధి మండల పరిధిలో ఇటీవల సంభవించిన తుఫానులు కారణంగా వరి, రాజ్మా, కాఫీ, మినుములు తదితర పంటలు నాశనమై గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. దీంతో గిరిజనులు పిల్లలకు క్రిస్టమస్, సంక్రాంతి పండగలకు బట్టలు కొనుక్కోలేక ఇంట్లో పండగలు నిర్వహించుకోలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ చీడిగుంట గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ నిధులు రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామంలో సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యేవారని, ఈ రోడ్డు పనులు పూర్తయితే రహదారి సమస్య తొలగిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, మాజీ వైస్ ఎంపీపీ శెట్టి కాసులమ్మ, కోటమ్మ, నాయకులు పొత్తూరు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు పంచాయతీల్లో పీసా కమిటీల ఎన్నికలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పీసా కమిటీల ఎన్నికలు జరిగాయి. చట్లవాడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ డి ప్రేమలత అధ్యక్షతన జరిగిన పీసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా బత్తుల ప్రతాప్ సింగ్, కార్యదర్శిగా దూడ రాజేష్ ఎన్నికయ్యారు. ఉక్కులూరు గ్రామ పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా వీరవత్తుల సాయికుమార్, కార్యదర్శిగా పల్లాల బుజ్జిరెడ్డి, కుండాడ పంచాయతీ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పీసా ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా చెదల మోహన్‌రెడ్డి, కార్యదర్శిగా బోదులూరు రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఉక్కులూరు కమిటీ ఎన్నికల్లో ఏవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ లావణ్య, కుండాడ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ రామకృష్ణ, పంచాయతీల ప్రజలు పాల్గొన్నారు

దేవీపట్నం : మండలంలోని కొండమొదలు పంచాయితీ సర్పంచ్ వేట్ల విజయ అధ్యక్షతన జరిగిన పీసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా కుండ్ల సురేష్ రెడ్డి, కార్యదర్శిగా బడిగుంట రాజా రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి పి.ప్రశాంతి, గ్రామ పంచాయితీ సెక్రటరీ సతీష్ కుమార్, వీఆర్వో విఘ్నేష్, హెడ్ కానిస్టేబుల్ మడకం గంగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన కార్యక్రమం 42 రోజుకు చేరింది. శుక్రవారం నిరసన శిబిరాన్ని లోతా రామారావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ, కార్మిక, గిరిజన సంఘాలు అండగా ఉన్నట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు 42 రోజులుగా ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీ హెల్పర్ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని అమ్మిరేకుల అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న ఆవు మంగ (59) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందగా, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. యూనియన్ జిల్లా నాయకురాలు కె వెంకటలక్ష్మి, మండల అధ్యక్షురాలు సిహెచ్ కుమారి తదితరులు మంగ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి యూనియన్ తరపున రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక వెబినార్‌లో మేధావుల డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర సమతుల్య, సమగ్రాభివృద్ధి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలువురు మేధావులు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో వారు మాట్లాడారు. ఈ వెబినార్ ఓ డిక్లరేషన్‌ను ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. వెబినార్‌లో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఎఎస్ ఇఎఎస్.శర్మ, ప్రొఫెసర్ కెఎస్.చలం, పర్యావరణవేత్త డాక్టర్ వై.కృష్ణమూర్తి, ప్రముఖ కవి గంటేడ గౌరు నాయుడు, ఎం.శ్రీనివాసా, బద్రి కుర్మారావు, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు, ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందలేదు సరికదా మరింత వెనుకబాటులోకి నెట్టబడ్డాయని వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 46 (3) ప్రకారం వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని కేంద్రం ఇవ్వకపోవడం, ప్రత్యేక హోదాను నిరాకరించడం, విభజన చట్టాన్ని సక్రమంగా అమలుచేయకపోవడమే దీనికి కారణమని అన్నారు. వీటిని అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్రంలోని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తగు కృషి చేయాలని కోరారు. గత పదేళ్ళుగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన, చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్ ప్లాంటును సైతం అమ్మేయాలని నిర్ణయించిందన్నారు. దీనిని అడ్డుకోవడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. నేటి ప్రభుత్వం విశాఖ ఉక్కుకు సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ప్రైవేటు రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంటు, దానికి అనుసంధానంగా ఒక పోర్టును నిర్మిస్తామని ప్రకటించిందని, ఇది కచ్చితంగా విశాఖ స్టీల్ ప్లాంటును బలహీనపరచడమేనన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సభ్యులు

మండల పరిషత్తు సమావేశం వాయిదా

- మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించి సమావేశాన్ని వాయిదా వేశారు. సభ్యులందరూ మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచికంగా పది నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ మృతికి మూడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించిన నేపథ్యంలో సర్వసభ సమావేశం సోమవారానికి వాయిదా వేసినట్లు చెప్పారు. సోమవారం సభ్యులందరూ హాజరు కావాలని వారు కోరారు. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. తన సానుకూల ఆలోచనలతో, ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని ప్రపంచ పటంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశిభూషణ్, సర్పంచులు పులి సంతోష్ కుమార్, పూనెం సరోజినీ, కారం బుచ్చమ్మ, నరసమ్మ, సవలం మారయ్య, ఎంపీటీసీలు పూనెం ప్రదీప్ కుమార్, భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మృతుల కుటుంబాలకు జెకెసి ట్రస్టు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలో అనారోగ్యంతో ఇద్దరు మృతి చెందిన, వారి కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని నర్సింగపేట గ్రామానికి చెందిన భద్రం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెకెసి ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ రూ.5000 నగదును మృతుని భార్య కృష్ణవేణికి జెకెసి ట్రస్ట్ సభ్యుల ద్వారా శుక్రవారం అందజేశారు. అలాగే మండలంలోని పోచవరం కాలనీకి చెందిన గొంది బాబు అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందారు. బాబు భార్య ముత్తమకు జెకెసి ట్రస్టు తరుపున రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు ఎడవల్లి భాస్కరరావు, పోడియం అప్పారావు, బరపాటి ప్రకాశరావు, గడేసుల ప్రేమ్ చంద్, చెలికాని ఉమామహేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు షేక్ రసూల్, సోడే రమేష్, పరిటాల అరుణ, వెంకన్న, కర్రి సుదర్శనరావు, మన్నే సందీప్, మడకం చిన్ని, సోయం రఘునాథ్, సోడే రావణయ్య, సోయం చంద్రరావు, సోయం సీతయ్య, సోయం వెంకటేష్, సోడే కళ్యాణ్, సోడే సీతయ్య, కిచ్చా చంద్రయ్య, కారం వినోద్, సోడే బుచ్చిరాజు, సోమయ్య, సేలం వెంకటేష్, కాపుల మహేష్, పల్లంటి రామకృష్ణ, గుర్రం ప్రసాద్, గొంది పార్వతి తదితరులు పాల్గొన్నారు.